అందరికీ సంక్షేమ ఫలాలు

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- వణికిస్తున్న చలిని సైతం లెక్క చేయకుండా గ్రామాల్లో పర్యటన
- 'గడప గడపకు' విశేష స్పందన


చీకటిపుట్టులో గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు

హుకుంపేట: రాష్ట్రంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గత్తుం పంచాయతీ చీకటిపుట్టు, జంగంపుట్టు, బొడ్డాపుట్టు గ్రామాల్లో ఎమ్మెల్యే పాల్గుణ పర్యటించారు. తెల్లవారుజామున వణికిస్తున్న చలిని సైతం లెక్కచేయడం స్థానిక నాయకులతో కలిసి గ్రామాలను సందర్శించారు. గ్రామస్తులకు గిరిజన సంప్రదాయంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 130 గడపలను ఎమ్మెల్యే సందిర్శంచారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలుచేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని స్పష్టం చేశారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ కూడా రాజుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, సొసైటీ బ్యాంకు చైర్మెన్ రామకృష్ణ, సర్పంచ్ పాడి పోతురాజు, ఎంపీటీసీ సభ్యురాలు సంబాయి కొండమ్మ, నాయకులు కామరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిత్యావసర సరకుల పంపిణీ


సరకులను అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు విజయ

కూనవరం: సేవతోనే సంతృప్తి ఆనందం పొందవచ్చని జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ అన్నారు. మండలంలోని భీమవరం గ్రామంలో కృష్ణార్జున ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసర సరకులను ఆమె ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కృష్ణార్జున ఫౌండేషన్ సేవలను కొనియాడారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాకునూరి కృష్ణార్జున రావు, వైఎస్సార్ సీపీ నాయకులు గుజ్జా బాబు, అఖిల్, వంశీ, నిఖిల్, యామిని, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలు, హక్కుల పరిరక్షణపై అవగాహన


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బుల్లికృష్ణ

అరకులోయ రూరల్: చట్టాలు, హక్కుల పరిరక్షణపై అవగాహనకు విస్తృత ప్రచారం చేయాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బుల్లికృష్ణ అన్నారు. స్థానిక గిరిజన మ్యూజియం ఆవరణలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో న్యాయ బంధు యాప్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఉన్నత సమాజ స్థాపనకు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా చట్టాలు, హక్కులపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శనీయం


సమావేశంలో మాట్లాడుతున్న కవిత

కూనవరం: కోతులగుట్ట కేజీబీవీలో ఐద్వా మహిళా సంఘం, యూటీఎఫ్‌ల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా మహిళాసంఘం అధ్యక్షురాలు కె.రాధ, యూటీఎఫ్ జిల్లా సంఘం సభ్యురాలు ఎం.కవిత మాట్లాడుతూదేశ చరిత్రలో మహిళా విద్యాభివృద్ధికి మొట్టమొదట పునాదులు వేసిన చైతన్య దీప్తి సావిత్రిబాయి పూలే అని చెప్పారు. బాలిక విద్యాభివృద్ధికి ఆమె చేసిన కృషిమరువలేనిదన్నారు. సావిత్రిబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆమె ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. సుధారాణి, దుర్గా, సీత, శాంత విజయ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తిరుమల యాత్ర


తిరుమల వెళ్లి తిరిగి వచ్చిన భక్తులు

అచ్యుతాపురం(అనకాపల్లి): తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో అచ్యుతాపురం సబ్ డివిజన్ సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీవారి దర్శనానికి ఉచిత బస్సుల్లో వెళ్లిన 98 భక్తులు ఆదివారం తిరిగి వచ్చారు. అచ్యుతాపురం సబ్ డివిజన్ పరిధిలో భక్తులు రెండు బస్సుల్లో తిరుమల వెళ్లి వచ్చారు. ఈ కార్యక్రమంలో బి. వి. రమణ, కొల్లి అప్పారావు, గుడివాడ రమణ, సూరాడ నూకరాజు, వెన్నెల అప్పలనాయుడు, దొడ్డి కృష్ణ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రబీ వరినాట్లు


ఇందుకూరుపేటలో నాట్లు వేస్తున్న కూలీలు

దేవీపట్నం: వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు రబీ పంటల సాగుపై నిమగ్నమయ్యారు. మండలంలో ప్రధానంగా వరి పండే గ్రామాలైన ఇందుకూరు, ఇందుకూరుపేట, శరభవరం, దేవారం పంచాయతీల్లోని గ్రామాల్లో రైతులు రబీ వరి సాగుపై దృష్టిసారించారు. ఖరీఫ్ ఆశాజనకంగా ఉండడంతో ఇప్పటికే కోతలు పూర్తికావడంతో ధాన్యం కొనుగోళ్లు రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే చేపడుతోంది. ఇప్పటికే దాదాపు 90 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. ఈ తరుణంలో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో కొండవాగులు ద్వారా సాగునీరు చెరువుల్లో చేరడంతో జలకళ దర్శనమిస్తోంది. దీనికి తోడు ముసురుమిల్లి ప్రాజెక్టులో నీరు సరిపడా ఉండడంతో సాగునీటికి ఢోకా లేదనే ధీమాతో రైతులు రబీ వరి సాగు చేపట్టారు. ఇందుకూరు, ఇందుకూరుపేట, శరభవరం, దేవారం పంచాయతీల్లో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా సన్నరకం పంటను సాగుచేస్తున్నారు. బెంగాల్ నుంచి వలస కూలీల రాకతో స్థానికంగా కూలీల కొరత లేకుండా పోయింది. బెంగాల్ కూలీలు కాంట్రాక్టు పద్ధతిలో నారు తీసుకుని నాట్లు వేసేందుకు ఎకరాకు రూ.4వేలు తీసుకోవడంతో రైతులకు ఇబ్బంది లేకుండాపోయింది. మరో వారం రోజుల్లో ఈ ప్రాంతంలో వరినాట్లు పూర్తయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి


కార్పెంటరీ వర్క్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ తదితరులు

హుకుంపేట: స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని గిరిజనులు ఆర్థికాభివృద్ధి చెందాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. కొంతిలి పంచాయతీ కేంద్రాంలో ఆయన స్థానిక నాయకులతో ఆదివారం పర్యటించారు. గ్రామంలో వెలుగు శాఖ ఆధ్వర్యంలో పీఎంఈజీపీ పథకం ద్వారా స్థానికుడు భవానీ, కోటిబాబు కుటుంబానికి మంజూరైన కార్పెంటరీ వర్క్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ గిరిజనులు విద్య, వైద్య, వ్యవసాయ రంగాలతో పాటు సాంకేతిక రంగాల్లో మెరుగైన స్థాయిలో రాణించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఎంపీపీ కూడా రాజుబాబు, ఐటీడీఏ కాఫీ ఏడీ అశోక్, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, సర్పంచ్‌లు సమిడ వెంకటపూర్ణిమ, నాయకులు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న సర్పంచ్ దాసుబాబు, నాయకులు

అరకులోయ రూరల్: ప్రభుత్వ స్థలాల పరిరక్షణ అందరి బాధ్యతగా తీసుకోవాలని సర్పంచ్ దాసుబాబు అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని సెరీకల్చర్ శాఖకు చెందిన (సర్వే నంబర్ 38/3బీ) స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలాలను కొంతమంది మాజీ ప్రజాప్రతినిధులు ఆక్రమించి, నిర్మాణాలు చేపడుతున్నారని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఎంపీటీసీ సభ్యులు భీమరాజు, శత్రుగున్, వార్డు సభ్యులు కిరణ్‌కుమార్, త్రినాథ్, సీమోన్, రామకృష్ణ, నాయకులు భగత్‌రాం, దామోదర్ తదితరులున్నారు.

బ్రిడ్జి పనులకు నేడు శంకుస్థాపన

జి.మాడుగుల: మండలంలో కిల్లంకోట పంచాయతీ కోడిమామిడి గెడ్డపై బ్రిడ్జి నిర్మాణ పనులకు సోమవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శంకుస్థాపన చేయనున్నట్టు పీఏసీఎస్ చైర్మన్ ఎస్.మత్స్యకొండంనాయుడు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.25కోట్లు మంజూరు చేసినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమానికి జిల్లా ఉన్నతాధికారులు విచ్చేస్తారని, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొవాలని కోరారు.

బిల్లులు చెల్లించాలి

జి.మాడుగుల: వంతాల పంచాయతీ మండిగరువు గ్రామంలో గత సంవత్సరం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా నిర్మించిన ఇళ్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు లబ్ధిదారులు చెబుతున్నారు. మండిగరువు గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోయినా ఇబ్బందులు పడుతూ శ్లాబ్ స్థాయిలో ఇళ్లు నిర్మించుకున్నామని, నేటి వరకు బిల్లులు అందలేదన్నారు. సర్పంచ్ పద్మ, ఎంపీటీసీ కళ్యాణి తదితరులు మాట్లాడుతూ ఉన్నతాధికారులు స్పందించి, లబ్ధిదారులకు త్వరితగతిన బిల్లులు చెల్లించాలని కోరారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు

అడ్డతీగల: ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలని రంపచోడవరం డివిజన్ మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్ అన్నారు. మండలం పదిరి మామిడి, రాజవొమ్మంగి మండలం రాజవొమ్మంగి మత్స్యక్షేత్రాల నుంచి గిరిజన మత్స్యకారులకు, మత్స్యకార సంఘాలకు 75 శాతం రాయితీపై చేప పిల్లలను అందిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం ద్వారా లబ్ధిదారులకు 60 శాతం రాయితీపై బ్యాంకు రుణంతో మినీ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్‌లు మంజూరు చేస్తున్నామన్నారు. దీంతో పాటు గిరిజన మత్స్యకారులకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా మత్స్యసంపద రవాణా వాహనాలను 60 శాతం రాయితీపై అందించనున్నట్టు తెలిపారు. గిరిజనేతర మత్స్యకారులకు 40 శాతం రాయితీపై రవాణా వాహనాలను కేటాయిస్తామన్నారు. ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్న ఆయా ప్రోత్సాహక పథకాలను ఉపయోగించుకోవాలని ఇన్‌స్పెక్టర్ రమేష్ సూచించారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు


వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సత్యనారాయణ


రోగులకు సూచనలిస్తున్న డాక్టర్ సుబ్బారావు


గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ అలీనశాంతి

గంగవరం: ఎర్రపాలెం గ్రామంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. కోట్నీస్ ప్రజా వైద్యశాల, గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో సుమారు 151 మందికి వైద్య పరీక్షలు చేశారు. సీపీఐ నాయకుడు, కోట్నీస్ ప్రజా వైద్యశాల డాక్టర్ చిన్నబిల్లి సత్యానారాయణ మాట్లాడుతూ ఆరోగ్య భద్రతను పాటించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శిబిరంలో పాల్గొన్న వారికి మందులు, దుప్పట్లు, బిస్కెట్లు, మాస్కులు పంపిణీ చేశారు. నాయకులు గణేశ్వర రావు, శ్రీను, గోవింద్, సతీష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: రంపచోడవరంలో రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి వినిష్ఫలానందజీ మహారాజ్ చెప్పారు. శిబిరంలో పాల్గొన్న డాక్టర్ టి.వి.సుబ్బారావు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో అవసరమైన వారికి రక్తపరీక్షలు నిర్వహించారు. పరమహంస యోగానంద నేత్రాలయం(వేమగిరి) ఆధ్వర్యంలో 40 మందికి కంటి పరీక్షలు చేశారు. 28 మందికి కళ్లద్దాలు అందజేశారు. రోగులకు భోజన సదుపాయం కల్పించారు. డాక్టర్ జి.భాస్కర్, రాయుడు శ్రీనివాస్, సంపత్‌కుమార్, శ్రీరాయుడు, నందినిలు వైద్య సేవలందించారు. రామకృష్ణ మిషన్ క్యాంప్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, సిబ్బంది, వలంటీర్లులు తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: నెల్లిపాక ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద గుడ్ సమారిటన్ ఇవాంజిలికల్ లూథరన్ చర్చి, కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత, సీఐ గజేంద్రపాలెం ప్రారంభించారు. శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ అలీనశాంతి గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. జనరల్ సర్జన్ మహ్మద్ ఫరీద్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జీఎస్ఈఎల్‌సీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కె.అబ్రహాం, సర్పంచ్ భద్రమ్మ, వైస్ ఎంపీపీ మంగేశ్వర రావు, రమేష్, వెంకట్ తదితరులున్నారు.

నూకాంబిక అమ్మవారి నగర సంకీర్తన


నూకాంబిక అమ్మవారి ఫొటోతో నగర సంకీర్తనలో భక్తులు

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం తెల్లవారుజామున నగర సంకీర్తన ప్రారంభమయింది. దేవదాయ ధర్మదాయ శాఖ జిల్ల కమిషనర్ బుద్ద మహాలక్ష్మినగేష్ ఆదేశాల మేరకు పోతురాజు సిండికేట్ ఆధ్వర్యంలో నూకాంబిక అమ్మవారి ఫొటోను చేతబూని గవరపాలెం పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారిఫొటోను ఆలయంలో నిలిపారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ప్రతినెల మొదటి ఆదివారం అమ్మవారికి నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సిండికేట్ బృందం సభ్యులు ఉమామహేష్, తారకేష్, రెడ్డి పెంటయ్యనాయుడు, రామగణేష్, వరలక్ష్మి, కామేశ్వరి, పద్మ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా జొన్న సాగు

- మార్కెట్‌లో గిరాకీ
- పెరుగుతున్న సాగు విస్తీర్ణం


కొయ్యూరులో జొన్న విత్తనాలు నాటుతున్న కూలీలు

కొయ్యూరు: రబీలో ఎక్కువ మంది రైతులు జొన్న పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు.ఒకప్పుడు రబీలొ వేరుశెనగను ఎక్కువగా పండించే రైతులు జొన్న వైపు దృష్టిసారించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువగా లాభాలు రావడంతో చాలా మంది రైతులు జొన్నను ఎంచుకుంటున్నారు. దీంతో పాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేపడుతున్నారు. కొయ్యూరు, రాజేంద్రపాలెంలో భూములకు నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయి. మండల పరిధిలో రెండు వేల ఎకరాలకు పైగా మొక్కజొన్న సాగుచేస్తున్నారు. జొన్నకు సాధారణ మార్కెట్‌తో పాటు కోళ్లకు దాణాగా వినియోగిస్తుండడంతో డిమాండ్ బాగుంది. మిగలిన పంటలతో పోలిస్తే జొన్నసాగుకు చాలా స్వల్పంగా పెట్టుబడి ఉంటుందని, కూలీల అవసరం కూడా ఉండదని రైతులు చెబుతున్నారు. వేరుశెనగ వేస్తే పంట చేతికి వచ్చిన తరువాత మొక్కల నుంచి కాయలను వేరు చేసేందుకు కూలీలు అవసరముంటుందంటున్నారు.

అపరాలను ఆక్రమించిన జీడి

ఒకప్పుడు మెట్ట భూముల్లో ఎక్కువగా అపరాలను పండించేవారు. ఇప్పుడు వాటికి బదులుగా జీడిమామిడిని సాగు చేస్తున్నారు. ఈ కారణంగా అపరాల సాగు తగ్గిపోతోంది. రాంకీ ఫౌండేషన్ గడచిన నాలుగు సంవత్సరాలుగా జీడీ సాగు కోసం రైతులకు విత్తనాలు అందజేస్తోంది.

అలాగే అనేక చోట్ల మెట్ట భూముల్లో తోటలను వేస్తున్నారు. జీడి తోటలను నాలుగు సంవత్సరాల వరకు సంరక్షణ చేస్తే సరిపోతుంది. పెట్టుబడి తక్కువ కావడంతో రైతులు ఈ తోటలను వేస్తున్నారు. ఒకప్పుడు 20 వేల ఎకరాల్లో మాత్రమే ఉండే జీడితోటలు ఇప్పుడు 28 వేల ఎకరాలకు విస్తీర్ణం పెరిగింది.

గ్రామాల్లో నేడు 'గడప గడపకు'

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి పంచాయతీలో వందనపల్లి, పొత్తడిగొంది, సంగంబంద,ఊడపాలెం, గెమ్మెలి గ్రామాల్లో సోమవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పీఏసీఎస్ చైర్మన్ మత్స్యకొండంనాయుడు తెలిపారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని మొండిగెడ్డ పంచాయతీలో ఈనెల 10, 11 తేదీల్లో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణులంతా పెద్ద సంఖ్యలో పాల్గొవాలని కోరారు.

అడ్డతీగల: మండలంలోని నిమ్మలపాలెం, మల్లవరం మామిళ్ల గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 2గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు వాటి వల్ల కలిగిన ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తారన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొవాలని కోరారు.

ఇంకెన్నాళ్లీ కష్టాలు

- నాలుగు రాష్ట్రాల కూడలిగా చింతూరు
- రాష్ట్ర విభజనతో పెరిగిన రవాణా వ్యవస్థ
- అరకొర సర్వీసులతో ఇబ్బందులు
- బస్ డిపో ఏర్పాటుతో తీరనున్న సమస్య

చింతూరు: ఆంధ్రా, తెలంగాణా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దులకు కూడలిగా ఉన్న చింతూరులో బస్ డిపో ఏర్పాటు కోసం విలీన మండలాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం చింతూరు కేంద్రంగా ఐటీడీఏ, సబ్ ట్రెజరీ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఎక్సైజ్, పోలీసు సబ్ డివిజన్, అటవీ డివిజన్, పోలవరం భూసేకరణ, ఆర్అండ్ఆర్, సబ్ కలెక్టర్ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. చింతూరుతో పాటు ఎటపాక, కూనవరం, వీఆర్ పురం మండలాలకు చెందిన ప్రజలు ఆయా కార్యాలయాల్లో ఏ పనివున్నా చింతూరు రావాల్సిందే. దీంతో పాటు చెంతనే ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో జగదల్‌పూర్ వరకు కొత్తగా జాతీయ రహదారి నిర్మాణం జరిగింది. అలాగే ఆంధ్రా, ఒడిశాలను కలుపుతూ చింతూరు మండలం కల్లేరు వద్ద సీలేరు నదిపై కొత్తగా వంతెన కూడా నిర్మించారు. దీంతో రాష్ట్ర విభజన అనంతరం చింతూరు మీదుగా రవాణా వ్యవస్థ అధికంగా పెరిగింది. ప్రస్తుతం కొత్తగా చింతూరు రెవెన్యూ డివిజన్‌గా కూడా ఏర్పాటుతో మరింత రద్దీ పెరిగే అవకాశముంది. అయితే నేటికీ విలీన మండలాల నుంచి జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో జిల్లా కేంద్రానికి పనుల నిమిత్తం వెళ్లేవారు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

బస్ డిపో ఆవశ్యకత ఎందుకంటే:

విలీన మండలాలకు పరిపాలన కేంద్రంగా ఉన్న చింతూరులో ఒక్క నైట్‌హాల్ట్ బస్సు సర్వీసు కూడా లేదు. పట్టణ ప్రాంతాలకు వెళ్లే బస్సులన్నీ వయా చింతూరు మీదుగానే ప్రయాణిస్తున్నాయి తప్ప చింతూరు నుంచి బయలుదేరే ఒక్క బస్సు కూడా లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీఆర్ పురం నుంచి వయా కూనవరం మీదుగా భద్రాచలంకు షటిల్ సర్వీసులు నడుస్తున్నాయి. దీంతో పాటు ప్రతి బుధవారం వారాంతపు సంత రోజున చింతూరు నుంచి గూడూరు, కొత్తపల్లి, కల్లేరులకు కూడా షటిల్ సర్వీసులున్నాయి. షటిల్ సర్వీసులుగా నడిచే బస్సులన్నీ గోకవరం డిపో నుంచి రావాల్సి ఉండగా సిబ్బంది విధుల్లో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సుదూరంలోని గోకవరంలో బస్ డిపో ఉండడంతో విలీన మండలాల్లోని మారుమూల గ్రామాలకు బస్సులు తిరగని పరిస్థితి నెలకొంది. కూనవరం, వీఆర్ పురం నుంచి చింతూరుకు షటిల్ సర్వీసులు లేకపోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు బస్ డిపో లేకపోవడంతో విజయవాడ, హైదరాబాద్ నుంచి వచ్చే నైట్‌హాల్ట్ సర్వీసులు ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని చిడుమూరులో నిలిపివేస్తున్నారు. చింతూరులో బస్ డిపో ఏర్పాటైతే విలీన మండలాల్లోని చాలా గ్రామాలకు షటిల్ సర్వీసులతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు, పొరుగు రాష్ట్రాలకు బస్సు సర్వీసులు నడిపేందుకు అనువుగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బస్‌డిపో ఏర్పాటు కోసం ఆర్టీసీ అధికారులు చొరవ చూపాలని విలీన మండలాల ప్రజలు కోరుతున్నారు.

గరుడ వాహన గోవింద


గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ధనుర్మాస అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉపమాకలో వేంకటేశ్వరస్వామివారిని లక్క గరుడ వాహనంపై తిరువీధి సేవలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేషపూజలు జరిపారు.అనంతరం కొండదిగువన ఉత్సతమూర్తులకు, ఆండాళ్లమ్మవారికి, వేణుగోపాలస్వామికి నిత్యార్చనలు పూర్తిచేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై 22వ పాశురాన్ని విన్నపం చేశారు.అనంతరం నీరాజన మంత్రపుష్పాలు, తీర్థగోష్టి నిర్వహించారు, లక్క గరుడ వాహనంలో ఉభయ దేవేరులతోకూడిన స్వామివారిని పల్లకిలో అమ్మవారిని ఉంచి తిరువీధి సేవలకు తీసుకెళ్లారు. రాత్రి అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారిని పల్లకిలోఉంచి తీరువీధిసేవలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, గోపాలాచార్యులు,శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో మేలుకొల్పులు

మాడుగుల/రోలుగుంట/గొలుగొండ: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో మేలుకొలుపులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రోజూ తెల్లవారుజాము నుంచే సీతారాముల ఉత్సవ విగ్రహాలను వీధుల్లో ఊరేగిస్తూ సంకీర్తనలు ఆలపిస్తూ తిరిగి ఆలయాలకు చేరుకుంటున్నారు. రోలుగుంటలోని మేలుకొల్పుల కార్యక్రమంలో చిన్నారులు సైతం పాల్గొన్నారు. విష్ణుమూర్తిని మేలకొలుపేందుకు ఆలపించిన భక్తి గీతాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. గొలుగొండ మండలం పుత్తడిగైరంపేటలో ఈ కార్యక్రమం నిర్వహించారు.